క్లుప్తంగా

టీచర్ మృతిపై సంతాపం



రవీందర్‌గౌడ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డీఈవో

రామాయంపేట(మెదక్): ఇటీవల మృతి చెందిన టీఆర్‌టీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఉపాధ్యాయుడు ఐరేని రవీందర్‌గౌడ్ దశదినకర్మలో జిల్లా విద్యాధికారి రాధాకిషన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఈవో రవీందర్‌గౌడ్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రణీద్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఐలయ్య, జిల్లా గౌరవాధ్యక్షుడు సరాపు ఇంద్రసేనాచారి, మండలాధ్యక్షుడు నర్సింహరావు, జిల్లా నాయకులు శేఖర్, శ్రీధర్‌రావు, వెంకటస్వామి, నర్సింగరావు, తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో మౌలిక వసతులు కల్పిస్తా : ఎంపీడీఓ



పాపన్నపేట(మెదక్): పల్లె ప్రజలకు మౌలిక వసతులు కల్పిస్తామని పాపన్నపేట ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించిన విష్ణువర్ధన్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. ప్రతీ పల్లెలో తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, పచ్చదనం తదితర అంశాలపై దృష్టి సారిస్తామన్నారు. ఇటీవల వర్షాలు కురిసినందున తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని కార్యదర్శులకు సూచించారు. ప్రతిరోజు పారిశుద్ధ్య పరిస్థితులు గమనించాలని కోరారు. నాటిన మొక్కలు ఎదిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలి: డీఎస్పీ



తూప్రాన్: మాట్లాడుతున్న డీఎస్పీ వెంకట్‌రెడ్డి

తూప్రాన్: గణేశ్ నవరాత్రి ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించుకోవాలని డీఎస్పీ వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని ఉత్సవ కమిటీ నాయకులతో ఓ ఫంక్షన్ హాల్‌లో శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండపాల వద్ద పోలీస్‌శాఖ నిబంధనల మేరకు రెండు సౌండ్ బాక్స్‌లు పెట్టుకోవాలన్నారు. విగ్రహాలను ఎప్పుడు నిమజ్జనం చేస్తారో వివరాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీఐ రంగాకృష్ణ, ఎస్‌ఐ శివానందం, తహసీల్దార్ విజయలక్ష్మి, మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీనివాస్, కౌన్సిలర్లు, నాయకులు మండపాల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ అధ్యక్ష, కార్యదర్శులుగా రాజు, సురేశ్



పాపన్నపేట(మెదక్): మండల పీఆర్టీయూ అధ్యక్షుడిగా పంతుల రాజు, ప్రధాన కార్యదర్శిగా సురేశ్ ఎన్నికయ్యారు. గురువారం ఎల్లాపూర్‌లో జరిగిన పీఆర్టీయూ మండల సర్వసభ్య సమావేశంలో ఏకగ్రీవంగా కార్యవర్గ ఎన్నిక నిర్వహించారు. అసోసియేట్ అధ్యక్షులుగా సంతోష్ కుమార్, ఫసియొద్దీన్, ఉపాధ్యక్షులుగా అనపోతారెడ్డి, మహిళా ఉపాధ్యక్షులుగా సంపత్ కుమారి, మహిళా కార్యదర్శిగా శ్యామల, కార్యదర్శిగా నాగేశ్వర్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాస్, కృష్ణ, వెంకట్‌రాంరెడ్డి, కృష్ణమూర్తి, అంజనచారి, టీచర్లు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యాలను వెలికితీయాలి



మాట్లాడుతున్న పాణిగ్రాహి

నర్సాపూర్ రూరల్: విద్యార్థుల్లో నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు డిమాక్స్ హ్యాకథ్యాన్ ఎంతో ఉపయోగపడుతుందని టీఎస్ కన్సల్టెంట్, డెలివరీ హెడ్ పాణిగ్రహి అన్నారు. గురువారం నర్సాపూర్ బీవీఆర్ఐటీ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి ఆన్‌లైన్ డిమాక్స్ హ్యాకథ్యాన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. స్మార్ట్ అగ్రికల్చర్, స్మార్ట్ హెల్త్, స్మార్ట్ ఎడ్యుకేషన్‌లపై సాంకేతిక పరిష్కార మార్గాలు రూపొందించడం జరుగుతుందన్నారు. కళాశాల డైరెక్టర్ డా.లక్ష్మీ, ఐటీ విభాగ అధిపతి దశరథ రామయ్య, సీఎస్‌బీఎస్ అధిపతి డిమాక్స్ ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు గణేష్ నాయుడు, వాహిని, విజయ్ పాల్గొన్నారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

జిల్లా వ్యాప్తంగా గురువారం గురుపూజ దినోత్సవాన్ని జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని పాఠశాలల్లో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఉపాధ్యాయులను సన్మానించారు.



పాపన్నపేట(మెదక్): అన్నారంలో టీచర్లను సన్మానిస్తున్న స్థానిక నాయకులు



నర్సాపూర్ రూరల్: ఉపాధ్యాయులను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు



కొడిపల్లి(నర్సాపూర్): వెంకట్రావ్‌పేటలో..



చిలప్‌చెడ్ ఉన్నత పాఠశాలలో మాట్లాడుతున్న ఉపాధ్యాయుడు



రామాయంపేట జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌ను సన్మానిస్తున్న విద్యార్థులు



చేగుంటలో సర్వేపల్లి విగ్రహానికి పూలమాలతో నివాళి అర్పిస్తున్న తపస్ సంఘం జిల్లా నాయకులు



రేగోడ్(మెదక్): ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పీసీసీ సభ్యుడు మున్నూరు



కొల్చారం(నర్సాపూర్): వై.మందాపూర్ పాఠశాలలో..



చిన్నశంకరంపేట(మెదక్): చందంపేట జెడ్పీపాఠశాలలో..



శివ్వంపేటలో..



వెల్దుర్తి(తూప్రాన్): సర్వేపల్లి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



విద్యార్థులతో ఉపాధ్యాయులు

టేక్మాల్(మెదక్): మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఉపాధ్యాయుల దినోత్సవం నిర్వహించారు. గురువారం పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఈ కార్యక్రమాన్ని పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సురకంటి కరుణాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు జానకిరామ్, విజయ్ కుమార్ ,శ్రీనివాస్, శ్రీధర్, అశోక్, మోహన్, దీపిక, లీల, బిన్నీ, జోసెఫ్, అరుణకుమారి, నాగేందర్, పీడీ, నర్సింలులు పర్యవేక్షించారు. అనంతరం ఉపాధ్యాయులుగా వ్యవహరించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

విద్యుత్ వినియోగానికి అనుమతి తప్పనిసరి



కొడిపల్లిలో మాట్లాడుతున్న ఎస్‌ఐ

చిన్నశంకరంపేట(మెదక్): వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా వినాయక మండపాల నిర్వాహకులు విద్యుత్‌శాఖ అనుమతి తీసుకోవాలని నార్సింగి విద్యుత్‌శాఖ ఏఈ స్వామి కోరారు.

పండగలు శాంతియుతంగా జరుపుకోవాలి

టేక్మాల్(మెదక్): గ్రామాల్లోని ప్రజలు పండగలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని అల్లాదుర్గం సీఐ రేణుక తెలిపారు. టేక్మాల్ పోలీస్ స్టేషన్‌లో ఏఎస్‌ఐ దయానంద్ ఆధ్వర్యంలో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు.

చిన్నశంకరంపేట పోలీస్‌స్టేషన్ ఆవరణలో..

చిన్నశంకరంపేట(మెదక్): వినాయక చవితి ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని ఎస్‌ఐ నారాయణగౌడ్ సూచించారు. చిన్నశంకరంపేట పోలీస్‌స్టేషన్ ఆవరణలో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. మండపాల ఏర్పాటుకు నిబంధనలు పాటించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు, మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

నార్సింగిలో...

నార్సింగి మండల కేంద్రంలో ఎస్‌ఐ అహ్మద్ మోహినోద్దీన్ అధ్వర్యంలో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు.

జాగ్రత్తలు పాటించాలి

కౌడిపల్లి(నర్సాపూర్): వినాయక చవితిని శాంతియుతంగా జరుపుకోవాలని ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి తెలిపారు. కౌడిపల్లిలో వినాయక మండపాల నిర్వాహకులతో పీస్‌కమిటీ సమావేశం నిర్వహించారు.

పెద్దశంకరంపేట(మెదక్): మండపాల ఏర్పాటులో జాగ్రత్తలు పాటించాలని ఎస్‌ఐ.శంకర్ అన్నారు. మండలంలోని మల్కాపూర్, బద్దారం తదితర గ్రామాల్లో ఉత్సవాలపై సూచనలు చేశారు.

హవేళిఘణాపూర్(మెదక్): హవేళిఘణాపూర్ పోలీస్‌స్టేషన్‌లో వినాయక మండపాల నిర్వాహకులతో పీస్ కమిటీ సమావేశాన్ని ఎస్‌ఐ సత్యనారాయణ నిర్వహించారు.

చెరువు బుంగ పూడ్చివేత



చందంపేట పెద్ద చెరువు కట్ట బుంగను పూడ్చిన సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని చందంపేట – రుద్రారం గ్రామ పెద్ద చెరువు కట్టకు ఏర్పడిన బుంగను ఇరిగేషన్ అధికారుల పర్యవేక్షణలో పూడ్చారు. గురువారం సాక్షి పత్రికలో చెరువుకు బుంగ.. రైతుకు బెంగ శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన ఇరిగేషన్ డీఈ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో సిమెంట్ బస్తాల్లో ఇసుకను నింపి బుంగ వద్ద కట్టల వేశారు. గురువారం బుంగ నుంచి నీరురావడం బంద్ అయింది. దీంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

మట్టి గణపతిని పూజించాలి



మట్టి ప్రతిమలను తయారు చేస్తున్న విద్యార్థులు

మనోహరబాద్(తూప్రాన్): వినాయక చవితి సందర్భంగా మట్టి గణపతిలను ప్రతిష్ఠించి పూజలు చేయాలని ఉపాధ్యాయులు పిలుపునిచ్చారు. గురువారం మనోహరబాద్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల మట్టి ప్రతిమలను తయారు చేశారు. రంగాయపల్లిలో ఎంఎస్ అగర్వాల్ పరిశ్రమ తరపున మట్టి వినాయకులను చెట్ల గౌరారం, రంగాయపల్లిలో గ్రామస్తులకు అందజేశారు.

సంక్షిప్త వార్తలు

◆ **గుర్తు తెలియని మృతదేహం**

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని గోమారం గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ మహిపాల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మూడు రోజుల నుంచి 40 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి గ్రామంలో సంచరిస్తూ భిక్షాటన చేస్తూ జీవిస్తున్నాడు. గురువారం గ్రామ పంచాయతీ రోడ్డులో మృతి చెంది ఉండగా, గ్రామ కార్యదర్శి కృష్ణ సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలాన్ని పరిశీలించి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు. మృతుడికి సంబంధించి ఎవరికైన తెలిస్తే పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని సూచించారు.

దాడి చేయడంతో మృతి..

గ్రామానికి చెందిన పలువురు యువకులు దాడి చేసి తీవ్రంగా కొట్టడంతోనే అతను అపస్మారక స్థితికి చేరుకొని మృతిచెందినట్లు పలువురు గ్రామస్తులు తెలిపారు. బుధవారం రాత్రి పలువురు యువకులు మద్యం మత్తులో అతనిపై దాడి చేసి తీవ్రంగా కొట్టడంతో ఉదయం కొనఊపిరితో ఉన్న అతన్ని గుర్తించిన గ్రామస్తులు 108కి సమాచారం ఇచ్చారు. వారు వచ్చి పరీక్షించేసరికి మృతిచెందాడన్నారు.

◆ **టేక్మాల్ ఎస్‌ఐగా రాజేశ్**

టేక్మాల్(మెదక్): మండల నూతన ఎస్‌ఐగా రాజేశ్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

◆ **కూలిన ఇళ్ల వివరాల సేకరణ**

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలోని ఆయా గ్రామాల్లో కూలిన ఇళ్ల వివరాలను సేకరించనట్లు తహసీల్దార్ గ్రేస్‌బాయి గురువారం తెలిపారు. ఆయా గ్రామాల్లో 67 ఇళ్లు వర్షానికి దెబ్బతిన్నాయని, వాటి వివరాలను ఉన్నతాధికారులకు నివేదించినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్ తదితరులున్నారు.

◆ **ఎల్‌ఓసీ అందజేత**

మనోహరబాద్(తూప్రాన్): రోడ్డు ప్రమాదంలో చికిత్స పొందుతున్న యువకుడి చికిత్స నిమిత్తం ఎల్‌ఓసీని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు ఎలక్షన్‌రెడ్డి అందజేశారు. మండలంలోని రామాయపల్లికి చెందిన వెంకటేష్ కొడుకు జశ్వంత్‌కు చికిత్స కోసం నాయకులు ఎల్‌ఓసీని అందజేశారు.

◆ **వ్యక్తిగత విమర్శలు చేస్తే సహించేది లేదు**

శివ్వంపేట(నర్సాపూర్): కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే సునీతారెడ్డిపై వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారని బీఆర్‌ఎస్ నాయకులు అన్నారు. గురువారం శివ్వంపేటలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రమణగౌడ్, హరికృష్ణ మాట్లాడుతూ.. ప్రొటోకాల్ విషయం తెలియని కాంగ్రెస్ నాయకులు ఇష్టరాజ్యంగా మాట్లాడడం మంచి పద్ధతి కాదన్నారు. వెల్దుర్తి మాజీ జెడ్పీటీసీ రమేశ్, బీఆర్‌ఎస్ నాయకులు లక్ష్మీనర్సయ్య, కొండల్, రేణుకుమార్, నాగరాజు, రాజు తదితరులు ఉన్నారు.

ఆయుష్ వైద్య సేవలు వినియోగించుకోవాలి

రంగంపేట యునాని ఆస్పత్రిలో వైద్య శిబిరం



శిబిరంలో రోగులను పరీక్షించి మందులను అందిస్తున్న సిబ్బంది

కొల్చారం(నర్సాపూర్): యునాని ఆస్పత్రుల్లో ఆయుష్ ద్వారా అందిస్తున్న వైద్య సేవలను ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని మండలంలోని రంగంపేట యునాని ఆస్పత్రి వైద్యురాలు క్వమీర్ ఉన్నీస్ పేర్కొన్నారు. గురువారం ప్రభుత్వ ఆస్పత్రిలో కొనసాగుతున్న యునాని ఆస్పత్రి ఆయుష్ యోగా మందిరంలో వృద్ధాప్య వైద్య శిబిరం(జెరియాట్రిక్స్ క్యాంప్)నిర్వహించారు. వివిధ సమస్యలతో బాధపడుతున్న వారికి వైద్యులు ఆరోగ్య పరీక్షలు చేసి, మందులు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా వైద్యురాలు మాట్లాడుతూ.. వృద్ధాప్యంలో సాధారణంగా వచ్చి అనారోగ్య సమస్యలకు ఆయుష్ వైద్య విధానం ద్వారా సులువైన చికిత్స అందించడం లక్ష్యంగా ఈ క్యాంపులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆయుష్ శాఖ, తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో సాధారణ ఆరోగ్య తనిఖీ, రక్తపోటు, మధుమేహం మోకాళ్ల నొప్పులు, ఇతర జబ్బులతో బాధపడుతున్న వారికి చికిత్స పూర్తిగా ఉచితంగా అందజేస్తామన్నారు. ఈ శిబిరంలో రంగంపేట, రామయంపేట యునాని వైద్యశాల ఫార్మసిస్టులు అనురాధ, మానసవీణ, పీటీఎస్ నవాబ్ పాషా, ఆశ వర్కర్ రాజ్య తదితరులు పాల్గొన్నారు.

సమతుల్య పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



చిన్నశంకరంపేటలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అంజమ్మ

చిన్నశంకరంపేట(మెదక్): సమతుల్య పౌష్టికాహారంతోనే ఆరోగ్యంగా ఉంటామని ఐసీడీఎస్ సైపర్‌వైజర్ అంజమ్మ కోరారు. గురువారం చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషణ్ అభియాన్ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, కిషోర బాలికలకు సమతుల్య ఆహారం అవసరమన్నారు. మహిళల్లో రక్తహీనత నివారణకు కేంద్ర ప్రభుత్వం పోషణ్ అభియాన్ కార్యక్రమం నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు మాలతి, రేణుక, జ్యోతి పాల్గొన్నారు.

టేక్మాల్(మెదక్): పౌష్టికాహారంతోనే ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీశైల తెలిపారు. మండలంలోని బర్దిపూర్, బొడ్మట్‌పల్లిలో గర్భిణులు, బాలింతలకు, విద్యార్థులకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఇందులో పాఠశాల హెచ్‌ఎం నర్సింలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ రద్దు సొమ్ము వచ్చేదెప్పుడు?

ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకున్నా.. తిరిగి రాని ఫైకం



గోదారి లింగం, రైతు, మిన్‌పూర్

పాపన్నపేట(మెదక్): మండలంలోని మిన్‌పూర్ గ్రామానికి చెందిన గోదారి లింగం ఏడాది క్రితం బంధువుల భూమిని కొనుగోలు చేశాడు. రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ కోసం ఆన్‌లైన్‌లో రూ.15 వేల ఫీజు చెల్లించాడు. కానీ సాంకేతిక కారణాలతో సమయానికి రిజిస్ట్రేషన్ కాలేదు. కొంత కాలం తర్వాత తిరిగి డబ్బులు కట్టి రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. అయితే మొదట చెల్లించిన సొమ్ము ఇంత వరకు తిరిగి రాలేదు. ఇలాంటి బాధితులు జిల్లా వ్యాప్తంగా వందకు పైగా ఉన్నారు. అందరిదీ ఇదే పరిస్థితి.

2020 నవంబర్ 2 నుంచి ధరణి ద్వారా సాగు భూముల రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్లు ప్రారంభమయ్యాయి. వారసత్వ బదిలీ, జీపీఏ, బహుమతి డీడ్ తదితర సేవలు ఇదే పోర్టల్లో అందుబాటులో ఉన్నాయి. ఏదైనా కారణంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ కోసం నమోదు చేసుకున్న స్లాట్ రద్దు చేసుకుంటే, ప్రభుత్వానికి చెల్లించిన సొమ్ము వెనక్కి రావడం లేదు. మ్యుటేషన్ ఫీజు ఎకరానికి రూ.2200తో పాటు సర్వే నంబర్ ప్రకారం చెల్లించిన భూమి రిజిస్ట్రేషన్ రుసుము ప్రభుత్వం వద్దనే ఉండి పోతోంది. ఇలా సుమారు నాలుగేళ్లలో రూ.లక్షల రిజిస్ట్రేషన్లు పెండింగ్‌లో ఉన్నాయి. 2022లో కలెక్టర్లు తమకు అందిన అర్జీల మేరకు విషయాన్ని ప్రభుత్వానికి నివేదిస్తే తిరిగి చెల్లింపులకు అనుమతి ఇచ్చినట్లు సమాచారం.

ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలి

ధరణి సేవలను రద్దు చేసుకున్న రైతులు తాము చెల్లించిన రుసుము తిరిగి పొందటానికి మీసేవలో దరఖాస్తు చేసుకోవాలి. కలెక్టర్ ధరణి లాగిన్ నుంచి ఆ క్లెయిమ్‌లను పరిశీలించి, అనంతరం ఖజానా శాఖ ద్వారా నిర్దిష్ట మొత్తాన్ని వెనక్కు అందించేలా ఏర్పాట్లు చేసింది. చాలా మంది బాధితులకు దీనిపై సరైన అవగాహన లేదు. కలెక్టర్ నుంచి క్లియర్ అయినా.. ఖజానా శాఖ నుంచి బాధితుల ఖాతాల్లో డబ్బులు జమ కావడం లేదు. దస్త్రం ఎక్కడ ఆగిందో, ఎందుకు ఆగిందో తెలియక బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తనకు ఏడాది అవుతున్నా.. డబ్బులు తిరిగి రాలేదని, వెంటనే డబ్బులు అందేలా చూడాలని మిన్‌పూర్ గ్రామానికి చెందిన గోదారి లింగం కోరారు.

గంగమ్మ ఆలయంలో పూజలు



మనోహరబాద్(తూప్రాన్): తుపాకులపల్లిలో బోనాల ఊరేగింపులో భక్తులు

తూప్రాన్: కొన్ని రోజులుగా భారీగా కురుస్తున్న వర్షాలకు తూప్రాన్ పెద్ద చెరువు గురువారం అలుగుపారింది. మున్సిపల్ చైర్‌పర్సన్ మామిళ్ల జ్యోతి కృష్ణ, పాలకవర్గం సభ్యులు చెరువులో పూజలు చేశారు. అనంతరం గంగమ్మ దేవాలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ నందాల శ్రీనివాస్ కౌన్సిలర్లు జ్యోతి రవీందర్ గుప్తా, శ్రీశైలం గౌడ్, జిన్నా భగవాన్ రెడ్డి, రఘుపతి, జిల్లా మత్స్యశాఖ డైరెక్టర్ దేవేందర్, ఉమర్, తదితరులు పాల్గొన్నారు.

తుపాకులపల్లిలో బోనాలు

మనోహరబాద్(తూప్రాన్): మండలంలోని పర్కిబండ గ్రామపంచాయతీ పరిధిలోని తుపాకులపల్లిలో యాదవులు గ్రామ దేవతలకు గురువారం బోనాలు ఊరేగించారు. అమ్మవారికి బోనాలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు.

'సీఎంను విమర్శించే స్థాయి లేదు'



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

నర్సాపూర్ రూరల్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని విమర్శించే స్థాయి బీఆర్‌ఎస్ నాయకులకు లేదని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. గురువారం వారు మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ నాయకులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని విమర్శించడానికి తీవ్రంగా ఖండించారు. నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడుతున్న కాంగ్రెస్ నాయకుల జోలికి వస్తే ఊరుకునేది లేదన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ గుప్తా, మండలాధ్యక్షుడు మల్లేశ్, పట్టణాధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రిజ్వాన్, మాజీ ఎంపీపీ శ్రీనివాస్ గౌడ్, సురేశ్ నాయక్, శ్రీశైలం యాదవ్, మల్లేశ్‌యాదవ్, హబీబ్ ఖాన్, అజ్మత్, నర్సింగ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బంధువులకు వృద్ధురాలి అప్పగింత



నర్సమ్మను ఆమె బంధువులకు అప్పగిస్తున్న ఎస్‌ఐ యాదగిరి, సిబ్బంది

చిలప్‌చెడ్(నర్సాపూర్): మతిస్థిమితం లేని ఓ వృద్ధురాలు తప్పిపోయి, చాముండేశ్వరి ఆలయ ఆవరణలో రోడ్డు పక్కన పొదల్లో కూర్చుంది. ఈ ఘటన మండలంలోని చిట్కుల్ గ్రామ శివారులో గురువారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ యాదగిరి తెలిపిన వివరాల ప్రకారం.. ఉదయం వాహనాల తనిఖీ చేసి, వస్తుండగా రోడ్డు పక్కన ఉన్న దీనంగా కూర్చొని ఉన్న వృద్ధురాలిని, వివరాలు అడగగా, ఆమె పేరు పట్లోళ్ల నర్సమ్మ అని, పటాన్‌చెరు దగ్గర బాచిగూడ అని చెప్పిందన్నారు. వెంటనే పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌కు ఫోన్ చేయగా, ఆమె పేరుపై అదృశ్యమైన కేసు నమోదై ఉందన్నారు. నర్సమ్మ ఆచూకీ తెలిసిన పటాన్‌చెరు పోలీసులు వెంటనే నర్సమ్మ బంధువులకు సమాచారం ఇవ్వగా, ఆమె బంధువులు శ్రీనివాస్‌రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి రావడంతో వారికి వృద్ధురాలిని అప్పగించామన్నారు.